క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సకు రవిరెడ్డి అభినందన



స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా బొత్సను కలిసి శాలువాతో సత్కరించారు. - మహారాణిపేట

వాజ్‌పేయికి నివాళి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆరిలోవ: బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానిగా దేశానికి చేసిన సేవలు కొనియాడారు. ఆయన వేసిన పునాదులే ఇప్పుడు పాలనకు బాటలుగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరంగ దానేష్, రాంబాబు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహావృక్షాల పరిరక్షణ మన బాధ్యత



సీతమ్మధారలో వృక్షానికి రాఖీ కడుతున్న స్థానికులు, విద్యార్థులు

సీతమ్మధార: చిల్డ్రన్స్ మూమెంట్ ఫర్ క్లైమేట్ జస్టిస్ నేతృత్వంలో శుక్రవారం వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. సీతమ్మధారలోని ఓ వృక్షానికి స్థానికులు, విద్యార్థులు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సిఫా ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహావృక్షాలను పరిరక్షించుకోవడం మన బాధ్యతని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గ్రీన్ అంబాసిడర్స్ విద్యార్థులు అధిక సంఖ్యలో విత్తనాలతో కూడిన రాఖీలు తయారు చేశారన్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు వాడవాడలా వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై నేడు సదస్సు



మహారాణిపేట: జీవీఎంసీ జోన్–4 కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. జిల్లాకు చెందిన రిటైల్ కెమిస్టులు, డ్రగ్గిస్టుల పాత్రపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, విశాఖ జిల్లా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా ఔషధ నియంత్రణాధికారులతో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

సాగరతీరం.. వ్యర్థాలమయం



నిరుపయోగంగా చెత్తకుండీలు



సాగరతీరంలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- కానరాని చెత్తకుండీలు
- గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా బీచ్ క్లీనింగ్
- ప్రభుత్వం మారడంతో 3 నెలలుగా స్తబ్ధత

బీచ్‌రోడ్డు: విశాఖ నగరం అంటే మనకు గుర్తుకు వచ్చేది అందమైన తీరం. ఈ సుందర తీరాన్ని పర్యాటకులు కచ్చితంగా సందర్శించే వెళతారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల నిర్వహణ గాలికి వదిలేసింది. ప్రస్తుతం వ్యర్థాలతో తీరం నిండిపోతోంది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. బీచ్‌రోడ్డుపై పలు చోట్ల గతంలో ఏర్పాటు చేసిన చెత్త కుండీలు ఇప్పుడు మచ్చుకైనా కానరావడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. అందులో భాగంగా తీరంలో పలు చోట్ల సిమెంట్ చెత్తకుండీలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మారిన తరువాత వాటి నిర్వహణను జీవీఎంసీ పూర్తిగా వదిలేసింది. ఉన్న చెత్త కుండీలో ఇసుకలో కూరుకుపోతున్నాయి. వైఎంసీఏ ఎదురుగా ఉన్న కొబ్బరి చెట్ల వద్దనే సుమారు పదికి పైగా చెత్తకుండీలు నిరుపయోగం పడి ఉన్నాయి. వాటిని తీరం వెంబడి ఏర్పాటు చేస్తే సందర్శకులు చెత్తను అందులో వేసే అవకాశం ఉంటుంది.

గతంలో ప్రతి నెలా బీచ్ క్లీనింగ్

ఎన్నికల ముందు వరకు ప్రతీ నెలా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నగరంలోని ఒక బీచ్‌క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక బీచ్‌ను ఎంపిక చేసుకొని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఎన్జీవోలు, పలు సంస్థలతో భారీ ఎత్తున బీచ్ క్లీనింగ్‌ను అప్పటి కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ నిర్వహించే వారు. దీంతో బీచ్‌లు చాలా శుభ్రంగా అందంగా కనిపించేవి..అయితే కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లు మారిన నేపథ్యంలో బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలు నిలిచిపోవటంతో తీరం వెంబడి చెత్త చెదారం పేరుకుపోతోంది.

తీర ప్రాంతం నిండా ప్లాస్టిక్ వ్యర్థాలే..

ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దాలని గత ప్రభుత్వం ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. ముఖ్యంగా సాగరతీరంలో ప్లాస్టిక్ వినియోగంపై అధికారులు కఠినంగా వ్యవహరించేవారు. తీరంలో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించేందుకు బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలను చేపట్టేవారు. ప్రస్తుతం జీవీఎంసీ అధికారులు సాగరతీరాల శుభ్రతను గాలికొదిలేశారు. బీచ్ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సందర్శకులు కోరుతున్నారు.

జూలో మొరాయిస్తున్న సీసీ కెమెరాలు



నీటి ఏనుగుల ఎన్‌క్లోజర్ వద్ద పనిచేయని సీసీ కెమెరా

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో సీసీ కెమెరాలు మొరాయిస్తున్నాయి. ఇక్కడ వన్యప్రాణులకు పటిష్టమైన రక్షణ కల్పిస్తున్నారు. వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద యానిమల్ కీపర్లతోపాటు సెక్యూరిటీ గార్డులు ఉంటున్నారు. వాటికి ఆహారం అందించడం, వాటి సంరక్షణలో యానిమల్ కీపర్లు ఉండగా.. వన్యప్రాణులకు ఎన్‌క్లోజర్ల వద్ద సందర్శకులు నుంచి ఎలాంటి ఇబ్బంది కలగకుండా సెక్యూరిటీ గార్డులు రక్షణ కల్పిస్తున్నారు. వీటితోపాటు మరింత భద్రత కోసం కొన్నాళ్ల కిందట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ముఖ్యమైన జంతువులైన పులులు, సింహాలు, చింపాంజీలు, నీటి ఏనుగులు, ఆఫ్రికన్ చిలకలు, పలు రకాల పక్షులు, ఏనుగులు తదితర వాటి వద్ద సీసీ కెమెరాలను అమర్చారు. వీటి వల్ల వన్యప్రాణులకు సమయానికి ఆహారం సరఫరా జరుగుతుందా లేదా, యానిమల్ కీపర్లు వాటికి ఆహారం సమయానికి అందిస్తున్నారా లేదా, యానిమల్ కీపర్లు, సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారా లేదా, సందర్శకుల ప్రవర్తన, ఎన్‌క్లోజర్‌లో వన్యప్రాణుల ప్రవర్తన, కదలికలు తదితర విషయాలు జూ అధికారులకు మోనిటరింగ్ ద్వారా వెంటవెంటనే తెలుస్తుండేవి. ఇవి కొన్నాళ్ల పాటు బాగానే పనిచేశాయి. కొద్ది రోజులుగా కొన్ని ఎన్‌క్లోజర్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. వీటికి ఎలుకల బెడద పట్టుకొంది. ఎలుకలు సీసీ కెమెరాల వైర్లు కొరికేస్తున్నాయి. దీంతో మరమ్మతులకు అవి గురై మొరాయిస్తున్నాయి. వాటిని బాగుచేయడానికి బయట నుంచి మెకానిక్ రావాల్సిందే. అతడు వచ్చే వరకు కొద్ది రోజుల పాటు ఆ కెమెరాలు పనిచేసే పరిస్థితి లేదు.

నీటి నిల్వలు లేకుండా చూడండి



మద్దిలపాలెంలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది



శివాజీపాలెంలో ఓ ఇంటి వద్ద నీటి నిల్వలను పరిశీలిస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

మద్దిలపాలెం: ఇంటి పరిసరాల పరిశుభ్రతతోపాటు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని జిల్లా మలేరియా విభాగం ఆరోగ్య కార్యకర్త కోనా వేణు సూచించారు. శివాజీపాలెం లక్ష్మీనగర్ 2వ లైన్‌లో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి వాటిని జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఇంట్లో నిత్యం వాడుక నీరు ఎప్పటికప్పుడు కాలువలోకి వెళ్లేలా శుభ్రం చేసుకోవాలన్నారు. పూజ గదుల్లో చెంబులతో పెట్టే నీరు వారానికి పైగా ఉంటే వాటిలో సైతం దోమలు ఉత్పత్తి చెందుతాయని, వాటిని తొలగించాలని సూచించారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందుతాయని, వాటి నుంచి రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్దిలపాలెంలో నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఆరోగ్య కార్యకర్త శేషుబాబు, సిబ్బంది పాల్గొని స్థానికులకు సూచనలిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మందుబాబుల ఆగడాలు



నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద తాగి పాడేసిన బీరు సీసాలు

ఆరిలోవ: మందుబాబులు దేనినీ వదలడం లేదు. ఖాళీ స్థలాలతోపాటు రాత్రివేళ మూతపడిన ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను బార్‌లుగా వినియోగించుకుంటున్నారు. ఆరిలోవలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను మందుబాబులు బాగా ఉపయోగించుకుంటున్నా రు. కొందరు ఆకతాయి యువకులు రాత్రి వేళల్లో మద్యం బాటిళ్లతో ఇక్కడికి వెళ్లి పూటుగా తాగుతున్నారు. అనంతరం ఖాళీ బాటిళ్లను వాటి ఆవరణలో మూలలకు విసిరేస్తున్నారు. కొందరు తాగిన మైకంలో సీసాలను పగలుగొడుతున్నారు. నెహ్రూనగర్(రాజేంద్రనగర్) అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం ఉదయం ఖాళీ బీరు సీసాలు దర్శనమిచ్చాయి. ఇక్కడ రోజూ ఇదే పరిస్థితి ఉంటుందని, చిన్నారు లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఈ అంగన్‌వాడీ కేంద్రం ఉండటం విశేషం. సంతపాలెం, అంబేడ్కర్ నగర్, ఆపరేషన్ కాలనీ, దీన్‌దయాల్‌పురం, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఉదయం ఉపాధ్యాయులు వెళ్లే సరికి ప్రతి రోజూ ఖాళీ మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. వీటిపై పోలీసులు మరింత నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జూనియర్ వైద్యులకు మద్దతు

- నేడు ప్రభుత్వ వైద్యుల నిరసన

మహారాణిపేట: దేశం యావత్తు తలదించుకునేలా ఒక పీజీ డాక్టర్‌పై జరిగిన అరాచకత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ దేశవ్యాప్త జూనియర్ డాక్టర్ల ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సంఘీభావం తెలుపుతోందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, డాక్టర్లు అత్యవసర పరిస్థితిని కూడా బహిష్కరించి ఉద్యమం చేస్తున్న వేళ.. ప్రభుత్వ డాక్టర్లు ఎటువంటి ఆందోళనలు చేయకుండా పేద రోగుల చికిత్సకు పూర్తిగా సహకరించాలని అసోసియేషన్ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. శనివారం నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. తమ అసోసియేషన్‌తో సంబంధం లేని కొంత మంది వ్యక్తులు ఉనికి కోసం ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ పేరుతో బాధ్యతారాహిత్యంగా గంట పాటు విధులు బహిష్కరించి ధర్నా చేయాలని పిలుపునివ్వడం చట్టరీత్యా నేరమని, వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

చెత్త కుప్పలతో దుర్వాసన



రజక వీధి గెడ్డలో నుంచి తీసి రోడ్డుపై వేసిన పూడిక

మద్దిలపాలెం: ఇసుకతోట రజక వీధి గెడ్డలో నుంచి భారీ స్థాయిలో పూడికలు తీసి పాత వెంకోజీపాలేనికి వెళ్లే దారిలో కుప్పగా వేశారు. తడి ఆరే వరకూ పూడికను అలానే ఉంచుతారు. అయితే ఈ చెత్త కుప్ప నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతోంది. పరుపులు, ఇంట్లో పాత సామగ్రి సైతం గెడ్డలో వేశారు. దీంతో గెడ్డలో మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. వీటిని పొక్లెయిన్‌ల ద్వారా తొలగించారు. పలువురు స్థానికులు గెడ్డల్లో పనిరాని సామగ్రిని వేయడంతో ఈ సమస్య తలెత్తింది. గెడ్డల్లో చెత్త వేయకుండా చూడాల్సిన 16వ వార్డు శానిటరీ సిబ్బంది తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తీరా తొలగించిన చెత్తను కుప్పలుగా రోజుల తరబడి ఉంచడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇసుకతోటలోని పశు సంవర్ధక శాఖ ఆస్పత్రి ఎదురుగా చెత్త కుప్పలు వేశారు. తక్షణమే చెత్తను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–3, జోన్–4 పరిధి పలు ప్రాంతాల్లో శనివారం తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీరు కేవీఎస్ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ టీఎస్ఆర్ నుంచి హైలెవల్ రిజర్వాయర్‌కి మంచినీటిని సరఫరా చేసే 400 ఎంఎం డయా సీఐ పైపులైన్ మరమ్మతులకు గురైనందున, మరమ్మతులు చేసే విషయమై శనివారం ఆయా జోన్ల పరిధి పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని చెప్పారు.

తాగునీటికి అంతరాయం ఏర్పడే ప్రాంతాలివే..

20వ వార్డు ఈస్ట్‌పాయింట్ కాలనీ, పెదవాల్తేర్, 21వ వార్డు మహిళ వీధి, విద్యానగర్ కాలనీ, రెల్లివీధి, ఏయూ అవుట్‌గేట్ డౌన్, ఓల్డ్ సీబీఐ డౌన్, మైత్రీనగర్, వినాయఘర్ అపార్టుమెంట్స్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, పాండురంగాపురం, బీచ్‌రోడ్డు సబ్‌మెరైన్, ఓషన్ వ్యూ లేఅవుట్ ఏరియా, చినవాల్తేర్ ఏరియా, 22వ వార్డులో బాలాజీనగర్, టైమ్స్ ఆఫ్ ఇండియా, సిద్దార్థనగర్, 24వ వార్డులో పాత రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం ఏరియా, 27వ వార్డులో అశోక్‌నగర్, రామాటాకీస్ రోడ్డు, శ్రీనగర్, బుదిల్‌పార్క్ రోడ్డు, రెడ్డి ఆస్పత్రి రోడ్డు, శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్డు, ద్వారకానగర్ రోడ్డు నంబరు 1 నుంచి 6వ లేన్ వరకు, అమర్‌నగర్ చర్చి రోడ్డు, సీబీఎం కాంపౌండ్, రామాటాకీస్ లేడీస్ గేట్ బుకింగ్ రోడ్డు, 28వ వార్డులో ఫేకర్ లే అవుట్, కైలాసమెట్ట, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుంది. ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేయనున్నట్లు పర్యవేక్షక ఇంజినీర్ తెలిపారు.

ప్రభుత్వ రంగంలోనే పేదలకు నాణ్యమైన వైద్యం

మద్దిలపాలెం: ప్రభుత్వ రంగంలో వైద్యం ఉంటేనే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య రంగాన్ని పీపీపీ పద్ధతిలో ప్రవేశపెట్టాలని ఆలోచన చేయడం ఆందోళన కలిగిస్తోందన్నా రు. ఈ నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బలమైన శక్తిగా భారత్ అవతరించాలి



మాట్లాడుతున్న కమొడోర్ ఉదయభాస్కర్

సీతంపేట: భారతదేశం బలమైన శక్తిగా అవతరించాలని ఢిల్లీ సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ కమొడోర్ సి.ఉదయభాస్కర్ ఆకాంక్షించారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో భారతదేశ విదేశాంగ విధానానికి సంబంధించి వ్యూహాత్మక కార్యాచరణపై శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను చర్చిస్తూ రాబోయే కొన్ని నెలలు అక్కడి పరిస్థితులను నిశితంగా గమనించాలన్నారు. పొరుగున చైనా రాజకీయంగా, ఆర్థికంగా, సైనిక పరంగా బలమైన శక్తిగా ఉందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. 1971కి ముందు పరిస్థితులు బంగ్లాదేశ్‌లో రాగలవా అనే విషయంలో వేచి చూడాలని, ఇప్పుడు మనం అలీన విధానం నుంచి పక్కకు జరిగామని, ప్రపంచంలో మూడో బలమైన శక్తిగా భారత్ అవతరించాలని అభిలషించారు. పాత్రికేయుడు కె.వి.ప్రసాద్ మాట్లాడుతూ హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్ ఆధిపత్యం సాధించాలని చెప్పారు. పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఎ.ప్రసన్నకుమార్ సభకు అధ్యక్షత వహించారు.

తాటిపూడి జలాశయానికి 'గౌరిపాటి' పేరును కొనసాగించాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

బీచ్‌రోడ్డు: స్వాతంత్ర్య సమరయోధుడు, సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం నిరంతరం పోరాడిన గౌరిపాటి బుచ్చి అప్పారావు పేరును తాటిపూడి జలాశయానికి యథావిధిగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. బీచ్ రోడ్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం తాటిపూడి ప్రాజెక్టుకు గౌరిపాటి పేరును నామకరణం చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాటిపూడి జలాశయం పేరు మారుస్తూ జీవో 35 విడుదల చేసిందన్నారు. ఈ నిర్ణయం వెలమలను, ఆ ప్రాంత ప్రజలను అవమానించడమేనన్నారు. గౌరిపాటి బుచ్చి అప్పారావు పేరును కొనసాగించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రులకు లేఖలు రాశామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి గంగు మన్మధరావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, వైస్ ప్రెసిడెంట్ వరుదు రాజ్‌కుమార్, విశాఖ జిల్లా ఇన్‌చార్జి రెడ్డి ఈశ్వర్‌రావు అనకాపల్లి ఇన్‌చార్జి బర్ల పైడం నాయుడు, తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి గొల్లు శ్రీను, పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి రొంగల చిన్నబాబు, విజయనగరం జిల్లా ఇన్‌చార్జి పెంట భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్‌లో అంధకారం



విశాలాక్షినగర్‌లో చీకటిమయమైన కో ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో అంధకారం నెలకొంది. ఇక్కడ ప్రధాన రహదారైన కో ఆపరేటివ్ బ్యాంక్ నుంచి బీచ్ రోడ్డు వరకు విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో ఈ రోడ్డంతా అంధకారం అలముకొంది. కొద్ది రోజులుగా సాయంత్రమైతే లైట్లు వెలగక చీకటిమయమవుతోంది. దీంతోపాటు వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. చీకటిలో ద్విచక్ర వాహనాలు, పాదచారుల వెంట కుక్కలు పడి దాడిచేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో రాత్రి వేళ ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం, జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇక్కడ 41/ఏ2/1 విద్యుత్ స్తంభం నుంచి వరుసగా ఏ దీపాలూ వెలగడం లేదని అంటున్నారు. వీటిని వెంటనే బాగుచేయించి విద్యుత్ లైట్లు వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య



అనూష మృతదేహం

గోపాలపట్నం: క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలి.. బుచ్చిరాజుపాలెం దరి సీతా రామరాజుగర్‌లో పి.అనూష(25) కుటుంబంతో కలిసి నివసిస్తోంది. భర్త చెన్నైలో మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పిల్లలను అత్త కోసం టిఫిన్ తీసుకురమ్మని పంపించింది. వారు వచ్చే సరికి ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని మృతిచెందింది. స్థానికులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు చేరుకుని వివరాలు సేకరించారు.

రూ.90 వేల కోసం ..

మృతురాలి వద్ద సూసైడ్ నోట్ లభ్యమైంది. 'అత్తకు తెలియకుండా ఆమె ఖాతాలో రూ.90 వేలు వాడేశాను. భర్త పలాసలో వివాహానికి హాజరయ్యేందుకు వస్తున్నారు. డబ్బు గురించి అడిగితే సమాధానం చెప్పుకోలేను. పిల్లలను నా తమ్ముడు చూసుకుంటాడు. నా చావుకు ఎవరూ కారణం కాదు' అని లేఖలో పేర్కొంది.

భర్త ఇంటికి చేరుకునే లోగా శవమై..

మరో అరగంటలో భర్త వెంకటరమణ ఇంటికి చేరుకుంటాడన్న సమయానికి భార్య ఆత్మహత్య చేసుకోవడంతో లబోదిబోమని విలపించారు. నాన్నతో కలిసి పెళ్లికి వెళ్దామని పిల్లలను ఉదయాన్నే లేపి వేగంగా తయారు కావాలని చెప్పింది. నానమ్మకూడా వస్తుంది. ఆమెకు టిఫిన్ తీసుకు రావాలని పంపింది. ఇంతలో పిల్లలను అనాథలు చేసే నిర్ణయం తీసుకుందని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు. భర్త ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు పర్యవేక్షణలో హెచ్‌సీ శివసాగర్ దర్యాప్తు చేపట్టారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

శుభకారిణి.. సౌభాగ్య ప్రదాయిని



బంగారు చీర అలంకరణలో లలితాదేవి

సీతంపేట: సౌభాగ్యాన్ని, సిరిసంపదలను ప్రసాదించే వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో లలితాదేవి బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో ఉదయం వ్రతం చేసుకుని సాయంత్రం అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం వద్ద జనం క్యూ కట్టారు. పూలమాలలు, పట్టు వస్త్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు జరిపారు. మధ్యాహ్నం పీఠంలో నిర్వహించిన విశేష అన్నదానలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లలితాపీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డీఎస్సీలో సీఆర్పీలకు వెయిటేజీ ప్రకటించాలి

- ఉద్యోగుల జేఏసీ నాయకుల విజ్ఞప్తి

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ–24లో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ కల్పించాలని ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంచరపాలెం బీఎస్‌ఆర్ భవనంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విశాఖ జిల్లా జేఏసీ ప్రతినిధులు పి.గణపతి, లంక చైతన్య శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఈడీ, టెట్ పరీక్షలు పాసై సమగ్ర శిక్షలో 12 ఏళ్లుగా చాలీచాలనీ జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ ఇచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

'మైనారిటీ సమితి' జిల్లా అధ్యక్షుడిగా అస్లం ఖాన్



అస్లం ఖాన్‌ను అభినందిస్తున్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారుఖ్ షబ్లీ

సీతమ్మధార: రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా 14వ వార్డు సీతమ్మధారకు చెందిన మహ్మద్ అస్లం ఖాన్ నియమితుడయ్యారు. సీతమ్మధారలోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ ఫారుఖ్ షబ్లీ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో విశాఖలోని అన్ని నియోజకవర్గాలకు కొత్తగా అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమితి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అస్లం ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎంతో గౌరవ ప్రదమైన పదవిని కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఫారుఖ్ షబ్లీ, ముస్లిం పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.